# ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలయ్యేలా చూడాలి





## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసోవమయ్యేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారులు, సిబ్బందిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని కేజీబీవీ, జూనియర్ కళాశాల, తహసిల్దార్, ఎంపీడీఓ కార్యాలయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రి ఆవరణ, ఇన్ పేషెంట్ వార్డ్, ల్యాబ్, ఫార్మసీ పరిశీలించారు. ఓపి, అలాగే రక్త పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం పీహెచ్సీ పరిధిలో వైద్య సేవలు పొందుతున్న గర్భిణులతో కలెక్టర్ నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ అందుతున్న సేవలు, మందులువారి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఫార్మాసీని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిరంతరం వారి ఆరోగ్య వివరాలను సేకరించాలని, వారికి కావాల్సిన మందులు అన్ని అందుబాటులో ఉంచాలని వైద్యులు, ఆసుపత్రి సిబ్బందికి కలెక్టర్ సూచించారు.

### 10 జీపీఏ వచ్చేలా తీర్చిదిద్దాలి

రానున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ అన్ని సబ్జెక్టుల్లో వచ్చేలా తీర్చిదిద్దాలని ఆయా సబ్జెక్టు టీచర్లకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. కొనరావుపేటలోనిహా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.



తరగతి గదులు, స్టోర్ రూమ్ ఆహారం వన్డే గదిని పరిశీలించారు. కూరగాయలు, సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ సైన్సు పాఠ్యాంశాలు బోధించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. అలాగే విద్యార్థులకు వైద్య సిబ్బందితో పరీక్షలు చేయించాలని, వారికి కావాల్సిన మందులను అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. రానున్న పబ్లిక్ పరీక్షల దృష్ట్యా అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా ప్రణాళిక ప్రకారం చదివించాలని ప్రాక్టీస్ టెస్టులు రాయించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అలాగే ఇంటర్ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. తరగతి గదులు సైన్స్ ల్యాబ్ లు, టాయిలెట్స్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

### ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ

అనంతరం కలెక్టర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. తహసీల్ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. మండల స్థాయి అధికారులు విధుల్లో భాగంగా క్షేత్రస్థాయిలోకి వెళితే కార్యాలయంలో ఉన్న సిబ్బందికి సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు హాజరు కావద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వేణుమాధవ్, కేజీబీవీ ఎస్ఓ ఇందిరా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేదారీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి కాపాడుకుంటూనే చదువులో రాణించాలి





## జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుతూనే చదువులో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం , గురుకుల, కళాశాలలో ఏర్పాటు చేసిన బేటి బచావో - బేటి పడావో కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ విద్యలోపు రాణించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ బాలికల పాఠశాలలు, గురుకుల బాలికల పాఠశాలలలో విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రతపై హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతగా జిల్లాలో 12 పాఠశాలలలో చేపట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థినిలు యుక్త వయసు సమయంలో మరింత శుభ్రత పాటించాలని, శరీరం దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత ఉంటుందని, క్రీడారంగంలో సైతం రాణించవచ్చని తెలిపారు. బాలికలను కాపాడుకోవడం, చదివించుకోవడం తో పాటు వారిని స్వేచ్ఛగా అన్ని రంగాలలో తోడ్పాటు అందించాలని తెలిపారు. విద్యార్థిని లకు ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తినట్లయితే ఆరోగ్య కార్యకర్తకు సమాచారం అందించి అవసరమైన వైద్య సేవలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిచయం అధికారి ఆడెపు భాస్కర్, రెడ్ ఎక్స్ప్రెస్ భాను కల్లుకూరి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# రూ.4 లక్షలు ఇవ్వనందుకే కక్ష

## రాజకీయ జోక్యంతో ప్రహరీ కూల్చివేత

**ప్రజానావ, బెల్లంపల్లి:** బెల్లంపల్లి పట్టణం 2వ వార్డ్ పాలిటెక్నిక్ ఇందిరమ్మ కాలనీలో జనవరి 29న ఇంటి ప్రహరీ గోడలు కూల్చిన విషయం తెలిసిందే. ఈ విషయంలో శనివారం కుశ్నపల్లి స్వరూపరాణి మాణిక్ దంపతులు ఏఎంసీ ఏరియాలోని ప్రెస్ క్లబ్ ప్రెస్ మీట్ లో వారు మాట్లాడారు. తాము 20 ఏండ్లుగా నుండు మేము ఇందిరమ్మ ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నామని, ఇటీవల కూల్చిన స్థలాన్ని కన్నూరి వెంకటేష్ దగ్గర కొనుగోలు చేశామని, ఆ స్టలానికి తాము ప్రహరీ నిర్మాణం చేసే క్రమంలో అక్కడున్న మాజీ కౌన్సిలర్లు చింతపండు శ్రీనివాస్, అప్సర్ వచ్చి.. రూ.4 లక్షలు ఇవ్వాలని, లేదంటే మా స్థలం మాకు దక్కకుండా చేస్తామని పలుమార్లు బెదిరించారని బాధితులు వాపోయారు. తమకు అధికారికంగా అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, మీకు ఎందుకు డబ్బులువ్వాలని వాదించగా, అది మనసులో పెట్టుకొని, మాపై కక్ష సాధింపుగా అధికారులతో మా ఇంటి ప్రహరీని అధికార బలంతో కూల్చేశారని వాపోయారు. ఈ విషయంలో తమకు మద్దతుగా కూల్చవద్దని ఎంఆర్ఓను ప్రాధేయపడిన మాజీ చైర్మన్‌సూరిబాబు, మాజీ కౌన్సిలర్ అబ్జల్ మాటలు కూడా వినకుండా కూల్చేశారన్నారు. కూల్చాడమే కాకుండా సూరిబాబు, అబ్జల్ పై కేవలం వాళ్లు మా కోసం మాట్లాడినందుకు వారిపై అక్రమకేసులు పెట్టారన్నారు.



# గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజానావ, బెజ్జంకి: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుగ్గిళ్ళ గ్రామానికి చెందిన సోము కొమురయ్య (58) మృతి చెందినట్టు ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపారు. కూరగాయలు అమ్ముకొని జీవించే సోము కొమురయ్య శుక్రవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో మోపెడ్‌పై ఇంటి వెళ్లే క్రమంలో పల్లోటి స్కూల్ వద్ద రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుండి కరీంనగర్ వెళ్లే గుర్తుతెలియని వాహనం వెనక నుండి ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. అతడి కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు బెజ్జంకి పోలీసులు తెలిపారు.

# బీజేపీ అధ్యక్షుడిగా బండిని నియమించాలి

## సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్



**ప్రజానావ, బెజ్జంకి:** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌ను నియమించాలని బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్ జాతీయ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బెజ్జంకి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు ఎంపీగా,రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ కుమార్ ఉన్నప్పుడు ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో ఊరు ప్రతి జిల్లా తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేశారని టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎండ గట్టారని దళితులకు అండగా నిలిచారని బిజెపి అధికారంలోకి రావాలంటే బండి సంజయ్ కుమార్ కి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలని దొడ్ల ప్రశాంత్ జాతీయ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు.

# నవయువ క్రికెట్ యూత్‌కు జెర్సీలు



**ప్రజానావ, బెజ్జంకి:** బెజ్జంకి మండలకేంద్రానికి చెందిన నవయువ యూత్ క్రికెట్ క్రీడాకారులకు ఇల్లంతకుంట మండల కేంద్రంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన అయిలేని శ్రీనివాస్ రెడ్డి (సీతా రామయ్య) ప్రత్యేక అతిథిగా పాల్గొని క్రీడాకారులకు నూతన జెర్సీలు పంపిణీ చేశారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ జెర్సీలను అందజేసిన అయిలేని శ్రీనివాస్ రెడ్డికి క్రీడాభిమానులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బెజ్జంకి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య, టెంపల్ డైరెక్టర్ దోనే శ్యామ్ రావు, ఎలిగే సతీష్, మిట్టపల్లి చెన్నారెడ్డి, బుర్ర శ్రావణ్ గౌడ్,రోల్ల శ్రీకాంత్, తిప్పారపు మహేష్, దూమల సురేష్, దొడ్ల ప్రశాంత్, నవయువ యూత్ క్రికెట్ కెప్టెన్ వడ్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో టీఎన్టీయూసీ సంబరాలు



**ప్రజానావ, బెల్లంపల్లి :** భద్రాచలం పేపర్ మిల్లు ఐటీసీ ఎన్నికల్లో యూనియన్ టీఎన్టీయూసీ విజయం సాధించడంపై బెల్లంపల్లి పట్టణంలోని టీఎన్టీయూసీ కార్యాలయంలో శనివారం నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచి విజయోత్సవాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మణిరాం సింగ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో టీఎన్టీయూసీకి 480, ఐఎన్టీయూసీకి 420, బీఎంఎస్‌కు 21, బీఆర్టీయూకు 310, టీఈయూకు 18 ఇన్వాల్యుడ్ 3 ఓట్లు వచ్చాయన్నారు. ఐఎన్టీయూసీపై 60 ఓట్ల మెజార్టీతో టీఎన్టీయూసీ గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ నాయకులు నారాయణ, మల్లయ్య, జీవరత్నం సత్యనారాయణ, పోషం, ఓదెలు, కొమురయ్య, పాండే, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ధ్రువపత్రాలు అందించాలి

**ప్రజానావ, బెజ్జంకి:** విద్యార్థులకు సకాలంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, నిబంధనల పేరిట కాలయాపన చేయొద్దని స్వేరోస్ నెట్‌వర్క్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఉప్పులేటి బాబు స్వేరో కోరారు. ఈ మేరకు శనివారం వివిధ విద్యార్థి, ప్రజా సంఘాలతో కలిసి తహసిల్దార్‌సిబ్బందికి మెమొరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురుకుల పాఠశాల అర్హత పరీక్షకై కావాల్సిన ఆదాయ, కుల ధ్రువీకరణ తదితర పత్రాల కోసం మండలంలోని తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుతూ సమయానికి అందివ్వకుండా కాలయాపన చేస్తూ ధ్రువీకరణ పత్రాల కోసం అవసరం లేని నిబంధనల పేరిట విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ ప్రభుత్వం విద్యార్థులను గురుకుల పాఠశాలలో చేరకుండా చేస్తున్న ప్రయత్నమేనని విమర్శించారు.విద్యార్థులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హత పరీక్ష అప్లై చివరి తేదీని పొడిగించాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నెట్వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్ర సురేష్ కుమార్,స్వేరో మాజీ జిల్లా అధ్యక్షుడు బోనగిరి ప్రభాకర్,విద్యార్థి సంఘాల నాయకులు,సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్,సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్,ఏఐవైఎఫ్ కార్యదర్శి దొంతరవేని మహేష్,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వడ్లూరి పర్షరాములు,అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొత్త రాజ్ కుమార్ ఉప్పులేటి శ్రీనివాస్, బోనగిరి నవీన్,తాడిచెట్టు భూమయ్య,మహంకాళి బాలయ్య,మోదుంపల్లి రాజు, తల్లిందండ్రులు,ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



